ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కడప

జిల్లా వార్తలు

5

సోమవారం 15 సెప్టెంబరు 2025



గండికోటకు కృష్ణాజలాలు నిలిపివేత

● ప్రాజెక్టులో 26.5 టీఎంసీల నీటిమట్టం

కొండాపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టుకు అవుకు రిజర్వాయర్ నుంచి ఆదివారం కృష్ణాజలాలు నిలిపివేశారని ఈఈ ఉమామాహేశ్వర్లు తెలిపారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో నీటిమట్టం 26.5 టీఎంసీలకు చేరుకుందని, వాగులు, వంకలు, పెన్నా చిత్రావతి నదుల ద్వారా ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో 3,300 క్యూసెక్కులు ఉందన్నారు. గండికోట నుంచి మైలవరం జలాశయానికి 5,000 క్యూసెక్కులు, సీబీఆర్‌కు 500 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామని తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు.

జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లాకు ప్రథమ స్థానం

● 22,171 కేసులు పరిష్కారం

● రూ.16,24,85,555లు చెల్లింపు

● జిల్లా ప్రధాన జడ్జి యామిని



వివరాలను వెల్లడిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి యామిని

కడపరూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కడప జిల్లాకు మొదటి ర్యాంక్ దక్కిందని డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని తెలిపారు. ఆదివారం లోక్ అదాలత్ వివరాలను ఆమె వెల్లడించారు. ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఆయా కోర్టులలో 23 బెంచ్‌లను ఏర్పాటు చేసి 22,171 కేసులు పరిష్కరించామని, ఇందులో 21,894 క్రిమినల్ కేసులు, 214 సివిల్ కేసులు, 63 ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయన్నారు. పై మొత్తం కేసులలో కడపలోని జిల్లా కోర్టు ఆవరణంలో 2566 కేసులు, ప్రొద్దుటూరులో 894 కేసులు, రాజంపేటలో 1589, రాయచోటిలో 1187, బద్వేల్‌లో 1397, మైదుకూరు కోర్టులో 1801, జమ్మలమడుగులో 4493, సిద్దవటంలో 524, రైల్వేకోడూరులో 300, పులివెందులలో 2015, నందలూరులో 967, లక్కిరెడ్డిపల్లెలో 2092, కమలాపురంలో 2346 కేసులను పరిష్కరించామన్నారు. పై మొత్తం కేసుల పరిష్కారానికి కక్షిదారులకు రూ.16,24,85,555లు చెల్లించినట్లు తెలిపారు. అందరి సమష్టి కృషితోనే వరుసగా రెండవసారి ఉమ్మడి కడప జిల్లాకు ప్రథమ స్థానం వచ్చిందన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులకు, రెవెన్యూ సిబ్బందికి, పోలీస్ అధికారులకు, ఇన్సూరెన్స్, బ్యాంకు అధికారులు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యపై ఆనంవారిపల్లె..

● ఆ గ్రామమంతా ఉద్యోగస్తులే

● చదువు కోసం పరిగెడుతున్న పల్లె

● కష్టపడి కలలు నెరవేర్చుకుంటున్న యువత

7

నేడు మెగా డీఎస్సీ ఎంపిక తుది జాబితా విడుదల

7

ఆటో డ్రైవర్ల దరఖాస్తులకు మూడు రోజులే గడువు

7

కడప... ఇది స్టేట్‌లోనే అత్యంత పవర్‌ఫుల్ నేమ్. ఎందుకంటే వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్, పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల సొంత జిల్లా. అందుకే ఏపీలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా కడప శాంతిభద్రతల పరంగా ఫేమస్ ఏరియా. ఇక్కడ ఏ చిన్న ఇష్యూ జరిగినా రాష్ట్రంలోనే సంచలనంగా మారుతుంది. అలాంటి కీలకమైన జిల్లాకు తొలిసారిగా 2019 బ్యాచ్‌కు చెందిన యువ ఐపీఎస్ అధికారి అడుగు పెడుతున్నారు. ఈయనే షెల్కే నచికేత్ విశ్వనాథ్. 2019 బ్యాచ్‌కు చెందిన ఈయన తొలిసారిగా సోమవారం ఎస్పీగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఒకప్పుడు ఫ్యాక్షన్ గడ్డ, పాలిటిక్స్‌కు కీలకమైన గడప ఆయనకు స్వాగతం పలుకుతూ సమస్యల సవాల్ విసురుతోంది.

పోలీసు బాస్‌కు.. సమస్యల సవాళ్లు..!

● జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి విక్రయం

● గండికోటలో మైనరు బాలిక హత్య

● తలనొప్పిగా మారిన కానిస్టేబుల్‌పై హత్యాయత్నం

● జూదాన్ని పడుకోబెట్టిన గత ఎస్పీ అశోక్‌కుమార్

● కక్షగట్టిన కూటమి నేతలు

● నేడు ఎస్పీగా బాధ్యతలు చేపట్టనున్న షెల్కే నచికేత్ విశ్వనాథ్

(కడప-ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు అంటే 2000 దశకం ముందు కడపలో కత్తులతో కుత్తుకలు తెగాయి. అలాంటి ఫ్యాక్షన్ ఇక్కడ ఉండేది. ఇప్పుడు ప్రశాంతంగానే ఉన్నా... వైట్‌కాలర్ నేరాలు పెరిగాయి. ముఖ్యంగా సమాజానికి హానికరమైన గ్యాంబ్లింగ్, గంజాయి, క్రైమ్స్ అధికమయ్యాయి. వైసీపీ పాలనలో గ్యాంబ్లింగ్ ఇష్టారాజ్యంగా సాగింది. అప్పటి ఎస్పీ అన్బురాజన్, సిద్దార్థ్ కౌశల్ ఆధ్వర్యంలో గ్యాంబ్లర్లు రెచ్చిపోయారంటారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక హర్షవర్ధన్‌రాజు ఎస్పీగా వచ్చారు. ఆయన హయాంలో గ్యాంబ్లింగ్‌పై చర్యలు తీసుకున్నారు. అయితే వైసీపీ సోషల్ మీడియా వర్రా రవీంద్రరెడ్డి ఇష్యూలో ఆయన బదిలీ అయ్యారు. అప్పటి నుంచి రెండు నెలల పాటు ఎస్పీ లేరు. ఇదే అవకాశంగా తీసుకున్న గ్యాంబ్లింగ్ మాఫియా రెచ్చిపోయింది. కొంతమంది పోలీసు అధికారులు కూడా గ్యాంబ్లర్స్‌తో మిలాఖత్ కావడంతో విచ్చలవిడిగా జూదగృహాలు నిర్వహించారు. కడప, జమ్మలమడుగు, కమలాపురం మైదుకూరు, జమ్మలమడుగు ఇలా ఒకచోట ఏంటి.. ఎక్కడ చూసినా ఆడుకో రాజా ఆడుకో అన్నట్లుగా పేకాట ఆడుకున్నారు. రోజూ కోట్లాది రూపాయలు చేతులు మారాయి. అయితే ఈ ఏడాది జనవరి 24న ఎస్పీగా అశోక్‌కుమార్ బాధ్యతలు చేపట్టిన తరువాత సీన్ ఒక్కసారిగా మారిపోయింది. జూదగృహాలపై ఉక్కుపాదం మోపారు. ముఖ్యంగా జమ్మలమడుగు ప్రాంతంలో జరుగుతున్న జూదాన్ని తుదముట్టించారు. అనతికాలంలోనే జూదగృహాలను తుడిచేశారు. అది కూటమిలోని కొందరు జీర్ణించుకోలేక ఎస్పీని బదిలీ చేయించారంటారు. ఈ నేపథ్యంలో కరెక్ట్ యూత్ ఎస్పీ ప్రస్తుతం కడపకు రావడంతో ఆయనకు పలు సవాళ్లు ఎదురవుతున్నాయి.

సీఎం చంద్రబాబు శాంతిభద్రతల విషయంలో రాజీ పడరని, ముక్కు సూటిగా వెళతారనే పేరుంది. ఏ పార్టీ వారైనా సరే తప్పు చేస్తే వదలరు. కొత్త ఎస్పీలతో చంద్రబాబు నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో రియాక్ట్, రీచ్, రెస్పాండ్, రిజల్ట్ (4-ఆర్) విధానంలో పనిచేయాలని కొత్త ఎస్పీలకు హితబోధ చేశారు.

రియాక్ట్ - తీవ్రమైన ఘటన జరిగినప్పుడు క్షేత్రస్థాయి సిబ్బందిపై వదలేయకుండా వెంటనే స్పందించడం.

రీచ్ - వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లిసాక్ష్యాధారాలను సేకరించడం.

రెస్పాండ్ - మీడియా, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడం. వ్యక్తిగత సమస్యలతో సాయం కోరి వచ్చేవారితో మాట్లాడడం.

రిజల్ట్ - ప్రతి కేసులో త్వరితగతిన ఫలితాలు వచ్చేలా దర్యాప్తు చేయాలని సీఎం చంద్రబాబు హితబోధ చేశారు.



నేడు ఎస్పీ బాధ్యతల స్వీకరణ

కడప క్రైం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా నూతన ఎస్పీగా షెల్కే నచికేత్ విశ్వనాథ్ సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఉదయం 10గంటలకు జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పాత్రికేయుల సమావేశంలో పాల్గొంటారని తెలిసింది.

సవాళ్లు ఇవే..

ఇప్పటికీ జిల్లా వ్యాప్తంగా గంజాయి విక్రయాలు ఉన్నాయి, కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు పట్టణాల్లో గ్యాంగ్ సంస్కృతి ఉంది. కొంతమంది పనిలేని యువకులను గ్యాంగ్‌గా ఏర్పాటు చేసి సెటిల్‌మెంట్లు చేసుకుంటున్నారు. కడపలో సుమారు 130 గ్యాంగ్‌లున్నాయి. ఈ గ్యాంగ్‌లను అణచివేయాలి. వైసీపీ హయాంలోని వాళ్లే ఇప్పటికీ ఇంటెలిజెన్స్‌లో కీలక పోస్టుల్లో ఉన్నారు. ఆ బ్యాచ్ అంతా ఇప్పటికీ వైసీపీకి సపోర్టుగా ఉంది. ఎస్పీ తన మార్కు చూపించాలంటే తొలుత కళ్లు, చెవుల్లా ఉన్న ఎస్‌బీ, ఇంటలిజెన్స్‌తో పాటు స్టేషన్‌లో పాతుకుపోయిన బ్యాచ్‌లపై కొరఢా ఝులిపించాలి. లేదంటే ఎలాంటి ఫలితాలు ఉండవు. ఇప్పటికే వైసీపీ హయాంలోని బ్యాచ్‌లే కడప జిల్లా పోలీసుశాఖను ఏలుతోంది. ఇక వేంపల్లెకు చెందిన కానిస్టేబుల్ శ్రీనివాసరెడ్డిని మండలంలోని వైవీయూ వద్ద దుండగులు చంపేందుకు పన్నాగం వేశారు. ఈ క్రమంలో అతని కాళ్లను కట్టర్‌తో నరికారు. ఇది అప్పట్లో పెద్ద సంచలనంగా మారింది. ఈ ఘటన పోలీసు శాఖనే భయాందోళకు గురిచేసింది. ఇంతవరకు ఈ ముఠాను పోలీసులు పట్టుకోలేకపోయారు. నిజంగా ఇది పోలీసుల అసమర్థతేననే విమర్శలున్నాయి. గండికోటలో ఈ మధ్య ఇంటర్ విద్యార్థిని హత్యకు గురైంది. ఇది పెద్ద దుమారాన్ని రేపింది. కర్నూలు రేంజి డీఐజీ కూడా ఈ కేసును ఛేదించాలని ఇక్కడే తిష్టవేశారు. ఏమైందో కానీ ఇంతవరకు ఆ కేసులోని నిందితులను గుర్తించలేదు.


వంకలో జారిపడిన చిన్నారులు

● ఒకరు మృతి

● మరొకరిని కాపాడిన గ్రామస్థులు



చిన్నారి మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు, (ఇన్‌సెట్‌లో) మృతిచెందిన గుణదీప్



ప్రమాదానికి కారణమైన వంక

కొండాపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దత్తాపురం గ్రామంలో ప్రమాదవశాత్తూ వంకలో ఇద్దరు చిన్నారులు జారిపడిన ఘటనలో ఒకరు మృతిచెందగా, మరొక చిన్నారి ప్రాణాలతో బయటపడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. గ్రామం మధ్యలోనే ఉన్న వంక ఇటీవల కురిసిన వర్షపు నీటితో నిండుగా ఉంది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన గంగధార్ కుమారుడైన గుణదీప్(8)తో పాటు మరికొందరు చిన్నారులు ఆదివారం కావడంతో ఆ వంక సమీపంలో సరదాగా ఆడుకుంటున్నారు. కాగా ప్రమాదవశాత్తు గుణదీప్, మరో చిన్నారి వంకలో జారిపడ్డారు. గమనించిన గ్రామస్థులు నీటిలోకి దూకి వెతికారు. గుణదీప్ నీటిలోనే ఊపిరాడక మృతిచెందగా, మరొక చిన్నారిని గ్రామస్థులు కాపాడారు. ముక్కుపచ్చలారని చిన్నారిని కోల్పోవడంతో వారి తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. కాగా గుణదీప్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మూడవతరగతి చదువుతున్నాడు. ఇదిలా ఉండగా గ్రామం మధ్యలో ఉన్న వంకకు రక్షణ గోడ ఏర్పాటు చేయమని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోలేదని బీజేపీ మండలాధ్యక్షుడు మేకల బాలనాగిరెడ్డి ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వెంటనే స్పందించి రక్షణగోడను ఏర్పాటు చేయాలని ఆయనతో పాటు గ్రామస్థులు కోరుతున్నారు.



తిరుపతిలో జరిగిన మహిళా సదస్సులో పాల్గొన్న కడప ఎమ్మెల్యే మాధవి, తదితరులు

పేదల గూటికి అన్వేషణ



అర్హులైన పేదలకు ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు కూటమి సర్కారు అడుగులు వేస్తోంది. ఎన్నికల హామీలను అమలు చేసేందుకు ప్రణాళికా బద్ధంగా కసరత్తు మొదలు పెట్టింది. గత ప్రభుత్వ హయాంలో ఇంటిస్థలాలు పొందలేని పేదలందరికీ పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు స్థలాలు కేటాయించేలా ఇప్పటికే సీఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పేదల నివాసాలకు అనువైన భూముల సేకరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

● గత లేఅవుట్లలో ఖాళీ స్థలాల గుర్తింపు

● ఇప్పటికే అనువైన భూముల సేకరణకు కలెక్టర్ ఆదేశాలు

కలెక్టరేట్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో పేదలకు ఇచ్చిన స్థలాలు, చెరువులు, వంకలు, బురద నేలలు, కొండలను, ప్రభుత్వ, పట్టా భూములను కలుపుకుంటూ ఆ పార్టీ నేతలు భూ దోపిడీకి దిగారనే విమర్శలున్నాయి. భూమి కొనుగోలు కింద ఎకరం ధర రూ.5-10 లక్షలు పలకని భూమికి కడపలో ఏకంగా రూ.35 లక్షల వరకు, ప్రొద్దుటూరులో రూ.45 లక్షల వరకు కోట్లాది రూపాయల ప్రభుత్వ సొమ్ము వైసీపీ అనుయాయులు, రెవెన్యూలో కొందరు జేబుల్లో వేసుకున్నారనే విమర్శలున్నాయి. గత ప్రభుత్వ వైఖరిలా కాకుండా ప్రజోపయోగంగా ఉండే భూములను గుర్తించాలని సూచించారు. అలాగే వైసీపీ ప్రభుత్వం పేదలకు సెంటు, సెంటున్నర స్థలాల కోసం కేటాయించిన 625 లేఅవుట్ల పరిధిలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులకు చెందిన ఖాళీ జాగాలను గుర్తించాలని ఆర్డీవోలకు కలెక్టర్ సూచించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా అనువైన భూములు, గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన లేఅవుట్లలోని స్థలాల్లో ఇంకా నిర్మాణాలు చేపట్టకపోతే వాటి వివరాలను ఇప్పటికే రెవెన్యూ యంత్రాంగం జల్లెడ పట్టి లే అవుట్లలో 23 వేల ఇళ్ల స్థలాలు ఖాళీగా ఉన్నట్లు ఇప్పటికే ఒక నివేదిక సిద్ధం చేసుకున్నట్లు సమాచారం.

ఇళ్ల నిర్మాణాలకు పరుగులు

జగన్ సర్కారులో పేదలపై కపట ప్రేమ చూపారని తీవ్ర విమర్శలున్నాయి. పేదలకు సెంటూ.. సెంటున్నరలో పేదలకు ఇళ్లు కట్టి చేతికి తాళాలిస్తామని పేదలకు ఆశ కల్పించారు. రాజన్న బిడ్డ కదా ? మేలు చేస్తారని వారు సంబరపడ్డారు. అయితే బాత్రూం అంత స్థలం (సెంటు) అంటగట్టి పేదల ఇళ్ల నిర్మాణాలకు కళ్లెం వేశారనే అపవాదు మూటగట్టుకున్నారు. అంతేకాకుండా ఉచిత పథకాలంటూ ఊదరగొట్టిన జగన్ పేదల ఇళ్ల నిర్మాణ విషయంలో భరోసా ఇవ్వలేదు. కేవలం కేంద్రం ఇచ్చిన రూ.1.80 లక్షలతోనే ఇళ్లు నిర్మించుకోవాలంటూ సచివాలయ సిబ్బంది, హౌసింగ్, రెవెన్యూ యంత్రాంగంతో లబ్ధిదారులపై వత్తిడి పెంచారు. ఇళ్లు నిర్మించుకోకపోతే క్యాన్సల్ చేస్తామనే హెచ్చరికలతో లబ్ధిదారులు అప్పులు తెచ్చి కొందరు ఇళ్లు కట్టారు. ఆ లే అవుట్లలో జగన్ 5 ఏళ్ల పాలనలో రోడ్లు, కరెంట్, మంచినీరు లాంటి కనీస సౌకర్యాలు కల్పించలేదు. దీంతో జిల్లాలో ఆర్భాటంగా ప్రారంభమైన పేదల ఇళ్లు సౌకర్యాలు లేక, రాష్ట్ర ప్రభుత్వం సహకారం లేని కారణంగా జిల్లాలో 625 లేఅవుట్లలో 1,16,933 ప్లాట్లలో నిర్మాణాలపై పేదలు మొగ్గు చూపలేదు. అందులో 94 వేల మందికి కేటాయించిన ఇళ్లలో కేవలం 30 వేలు పూర్తి కావడం గగనమైంది. ప్రభుత్వం మారడం, ఏడాదిన్నర కాలం క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు పెండింగ్ బిల్లులు, పేదల ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎస్సీల లబ్ధిదారుల ఇంటికి రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు చంద్రబాబు అదనపు సాయం అందివ్వడంతో ఇళ్ల నిర్మాణాలు జోరందుకున్నాయి. కూటమి ప్రభుత్వ సాయంతో కలెక్టర్, హౌసింగ్ పీడీ, సిబ్బంది నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపినా ఇప్పటికీ 50 శాతం వరకు ఇళ్లు నిర్మించుకోకపోవడం గమనార్హం.

దరఖాస్తులు అంతంత మాత్రమే

ఎన్టీఆర్ గృహాల నిర్మాణాల కోసం జిల్లాలో పేదలు సచివాలయాల ద్వారా దరఖాస్తులు చేసుకుంటున్నారు. అయితే గత ప్రభుత్వంలో ఇబ్బడి, ముబ్బడిగా పేదలకు ఇంటి స్థలాలు అంటగట్టారని, అక్కడ నిర్మాణాలు చేపట్టలేమంటూ చాలా మంది పేదలు జగనన్న ఇళ్ల స్థలాలను రిజెక్ట్ చేశారు. సౌకర్యాలు లేని చోట ఉండలేమని చాలా మంది సెంటు, సెంటున్నర జగన్ ఇచ్చిన స్థలాల్లో బేస్‌మట్టాలు మాత్రమే వేసి వదిలేశారు. మరికొందరైతే ఈ ఇళ్లు నిర్మాణాలు పూర్తయ్యే నాటికి అప్పుల ఊబిలో చిక్కుకుంటామని భావించి తిరస్కరించిన వారూ లేకపోలేదు. ఇలాంటి వారందరూ చంద్రబాబు సర్కారు ప్రకటించిన 2-3 సెంట్లు స్థలాల కోసం నిరీక్షిస్తున్నారు. అయితే గతంలో ఇళ్ల స్థలాలు, గృహాలు మంజూరు చేయడంతో స్థలాలు వద్దని రద్దు చేసుకున్న వారికి, దూరాభారమంటూ కట్టకుండా ఉన్న పేదలకు తిప్పలు తప్పడం లేదు. కొత్తగా ఎన్టీఆర్ ఇళ్లు మంజూరుకు దరఖాస్తులు చేసుకుంటున్నప్పటికీ ఆన్‌లైన్‌లో వారి పేరు చూపిస్తున్నందున తిరస్కరిస్తుండడంతో లబోదిబోమంటున్నారు. ఇకపోతే ఇప్పటివరకు జిల్లాలో 15 వందల మంది పేదలు మాత్రమే ఇంటిస్థలాలు, గృహాలకు దరఖాస్తులు చేసుకున్నట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. అయితే అందులో చేపట్టిన విచారణలో దాదాపు 1100 దరఖాస్తుదారులు గతంలో ఇళ్లు పొందినట్లు తేలిందంటారు. ఇంకా భూముల సేకరణ, లే అవుట్లలో ఖాళీ స్థలాల వివరాలు పూర్తి స్థాయిలో వచ్చే నాటికి అర్హుల సంఖ్య పెరుగుతుందంటున్నారు.

మిగిలిన స్థలాలను గుర్తిస్తున్నాం

కూటమి సర్కారులో ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన ఆర్థిక భరోసాతో గతంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు 50 శాతం వరకు పూర్తి చేశాం. జిల్లాలో అన్ని లేఅవుట్ల పరిధిలో ఇప్పటి వరకు 94 వేల మంది పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేశాం. అందులో 50 శాతం నిర్మాణాలు జరిగాయి. ఇంకా లేఅవుట్లలో మిగిలి ఉన్న స్థలాలను గుర్తించి నిర్మించుకొనేలా ప్రోత్సహిస్తున్నాము.

- రాజారత్నం, హౌసింగ్ పీడీ

టమోట రూ.1 పలకడం దురదృష్టకరం


● కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి

వేంపల్లె, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పత్తి కొండ మార్కెట్‌లో టమోటా కిలో రూపాయి పలకడం అత్యంత దురదృష్టకరమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వేంపల్లెలో మీడియా సమావేశం లో ఆయన మాట్లాడారు. రైతులు పండిం చిన మిర్చి, పొగాకు, మామిడి, అరటి, చీనీ, టమోట, ఉల్లి ఇలా ఏ పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. రైతులను ఆదుకుంటామంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు మాటలే తప్ప చేతల్లో చూపడం లేదని విమర్శించారు. మార్కెట్ ఇంటర్వెన్షన్స్ స్కీం ద్వారా ప్రభుత్వం మార్కెట్‌లో ప్రవేశించి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చేయాలని, లేదా ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనాలన్నారు. అంతేకాకుండా రసా యన ఎరువుల ధరలు అమాంతం పెరిగిపో యాయని, రాష్ట్రంలో ఎక్కడ చూసినా యూరియా కొరత కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. దీంతో సాగుకు అయ్యే పెట్టుబడి మరింత ఎక్కువ అవుతోందని తెలిపారు.

విద్యపై ఆనంవారిపల్లె..

● ఆ గ్రామమంతా ఉద్యోగస్తులే ● చదువు కోసం పరిగెడుతున్న పల్లె ● కష్టపడి కలలు నెరవేర్చుకుంటున్న యువత
● తల్లిదండ్రులు మాత్రమే వ్యవసాయం ● అందరికీ ఆదర్శం ఆనంవారిపల్లె





ఉద్యోగపర్వం

జిల్లాలోనే మారుమూల మండలం. ఒకప్పుడు విద్యకు చాలా దూరంగా ఉండేది. ఇక్కడి ప్రజల జీవనాధారం వ్యవసాయం, పాడి, మేకలు, గొర్రెల పెంపకం. రానురాను గ్రామాలన్నీ నాగరికత పెరగడంతో పాటు యువత విద్యపై మక్కువ పెంచుకున్నారు. కష్టపడి చదివి కన్న కలలు నెరవేర్చుకుంటూ ఉన్నత ఉద్యోగాలు సాధిస్తున్నారు. దీంతో గ్రామాలన్నీ అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయి. అందులో ఆనంవారిపల్లె గ్రామం ఒకటి. ఈ గ్రామంలో దాదాపు 140 కుటుంబాలు, 450 మంది జనాభా ఉన్నారు. కొంతమంది చేనేత మగ్గాలు నేస్తారు. మరికొంత మంది వ్యవసాయం, పాడిపశువులతో జీవిస్తూ తమ పిల్లలను పెద్ద చదువులు చదివిస్తున్నారు. ఆ గ్రామంలోని యువతీయువకులు విద్యపై కసి పెంచుకున్నారు. పోటీతత్వంతో కష్టపడి ఇష్టపడి చదువుకుని ఉన్నత ఉద్యోగాలు సాధిస్తూ తల్లిదండ్రులను గర్వపడేలా చేస్తున్నారు. కన్న తల్లిదండ్రులను, పుట్టిపెరిగిన ఊరును ఆదర్శంగా నిలుపుతున్నారు.

- బి.కోడూరు (ఆంధ్రజ్యోతి)

కష్టం చూసి కల నెరవేర్చుకున్నా..



మాది చిన్న వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు మాకున్న కొద్దిపొలంలో వ్యవసాయం చేస్తుంటారు. అయితే వ్యవసాయంలో పెట్టుబడి ఎక్కువ, ఆదాయం తక్కువ వచ్చేది. తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను దగ్గరుండి చూసి కష్టపడి చదివి ఎస్ఐ ఉద్యోగం సాధించాను.

- నేలటూరు రామ్మోహన్‌రెడ్డి, ఎస్ఐ, ఆనంవారిపల్లె

డాక్టరు కావాలని సాధించా..



మా తల్లిదండ్రులు చేనేత కార్మికులు. మా తండ్రి మా గ్రామంలోనే చీరల వ్యాపారం చేస్తున్నారు. మేమిద్దం అన్నదమ్ములం. ఒక చెల్లెలు. ముగ్గురినీ చదవించారు. నేను పెద్ద డాక్టరు కావాలని చిన్నప్పటి నుంచి అనుకునేవాడిని. బాగా చదివి ఎంబీబీఎస్ పూర్తి చేసి ఇప్పుడు పీజీలో ఆలిండియా 11వ ర్యాంకు సాధించాను.

- దండె హనుమత్ జానకీరామ్, ఎంబీబీఎస్ ఎండీ, ఆనంవారిపల్లె

ప్రభుత్వ టీచరు కావాలన్న కల..



మాది చిన్న వ్యవసాయ కుటుంబం. చదువుకుంటే ఉద్యోగం వస్తుందని బాగా కష్టపడి చదివాను. నాకు ప్రభుత్వ టీచరు కావాలని కల. ఎంతో ఇష్టపడి కష్టపడి ఉద్యోగం సాధించాను.

- దండె లక్ష్మీనారాయణమ్మ, ప్రభుత్వ టీచరు, ఆనంవారిపల్లె

విద్యపై కసి

గ్రామంలో ఒకరికి ఉద్యోగం వచ్చిందంటే నేను కూడా ఉద్యోగం సాధిస్తా అనే దృఢ సంకల్పంతో విద్యపై కసిగా చదివి అనుకున్న ఉద్యోగాలు సాధిస్తున్నారు. గ్రామంలో ఇప్పటికే 8మంది ప్రభుత్వ టీచర్లు, నలుగురు ఎస్ఐలు, ఇద్దరు డాక్టర్లు, 8 మంది ఆర్మీ, ఐదుగురు బ్యాంకు మేనేజర్లు, ఇద్దరు సైంటిస్టులు, ఆరుగురు సచివాలయ ఉద్యోగులు, దాదాపు 80మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలతో వివిధ కంపెనీల్లో పనిచేస్తున్నారు. ఆ గ్రామంలోని యువత ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో దూసుకుపోతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ గ్రామంలో ఏ చిన్నవాడితో మాట్లాడినా ఎస్ఐ, లేదా డాక్టరును అవుతాననే సమాధానం వస్తుంది.

ఆ గ్రామమే ఒక పచ్చ తోరణం

ఆనంవారిపల్లె గ్రామంలో విశాలమైన రోడ్లు, ఇంటింటికీ ఒక చెట్టు ఉంటుంది. దీంతో గ్రామమంతా పచ్చతోరణంలా ఉంటుంది. ఇల్లు, పరిసరాలు, రోడ్లు, పరిశుభ్రంగా ఉంటాయి. చూడచక్కని ఇళ్లు నిర్మించుకున్నారు. ఆహ్లాదకరమైన ఆరోగ్యకరమైన వాతావరణంతో ఆనంవారిపల్లె శోభిల్లుతోంది.

కష్టపడుతున్న యువత

తమ తల్లిదండ్రులు కొంతమంది మగ్గాలు నేస్తుంటే మరికొంత మంది నష్టాలు తప్ప ఆదాయం లేని వ్యవసాయం చేస్తుంటే గమనించిన యువత కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని దృఢంగా సంకల్పించారు. చదువు ఒక్కటే తమను ఉన్నతస్థానంలో నిలుపుతుందని, అందుకోసం ఎంత కష్టాన్నైనా భరించేందుకు యువత పూనుకున్నారు. ఈ నేపథ్యంలో తమ కలలు నేర్చుకుని తల్లిదండ్రుల ముఖాల్లో ఆనందాన్ని, సమాజంలో గౌరవాన్ని నిలబెట్టుకున్నారు. ఈ పట్టుదల పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది.

ఉద్యోగం సాధించాలని పట్టుదలతో..



మాది వ్యవసాయ కుటుంబం. మా తల్లిదండ్రులతో పాటు వ్యవసాయ పనులకు వెళ్లేవాడిని. ఎంత కష్టపడ్డా ఆదాయం వచ్చేది కాదు. పెట్టుబడికి ఆదాయం సరిపోయేది. చదివి ఉద్యోగం సాధించాలనుకున్నా. ఆర్మీలో ఉద్యోగం పొందాను.

- తిమ్మారెడ్డి చెన్నకేశవరెడ్డి, ఆర్మీ ఉద్యోగి, ఆనంవారిపల్లె

బ్యాంకు ఉద్యోగం కావాలని..



మా గ్రామంలోని యువతతో పాటు నేను కూడా పెద్ద ఉద్యోగం సాధించాలని పట్టుదలతో చదివాను. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియాలో క్యాష్ ఆఫీసరుగా ఉద్యోగం సాధించా.

- ముప్పూరి శివశంకర్, క్యాష్ ఆఫీసరు, ఆర్‌బీఐ, ఆనంవారిపల్లె



గ్రామంలోని అందమైన భవంతులు

ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా మురళి,నరసింహారెడ్డి



మురళి



నరసింహారెడ్డి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా తుపాకుల మురళి, అట్లా నరసింహారెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం కడపనగరం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో కడప ఉప విద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కోశాధికారిగా చిన్న వెంకటసుబ్బయ్యతో పాటు ఇతర కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు హుస్సేన్, మల్యాద్రి, ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మెగా డీఎస్సీ ఎంపిక తుది జాబితా విడుదల

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 ఎంపిక పరిధిలోకి వచ్చిన అభ్యర్థుల ధ్రువపత్రాలను సవివరంగా పరిశీలించి, మేనేజ్‌మెంట్ వారీగా, పోస్టు వారీగా తుది ఎంపిక జాబితాలను రూపొందించడం జరిగింది. ఈ తుది జాబితాలను సెప్టెంబరు 15న విడుదల చేయనున్నారు. ఈ జాబితాలు సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయం, మెగా డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్:// ఏపీడీఎస్సీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్/లో అందుబాటులో ఉంటాయి.

గంజాయి స్వాధీనం

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొజ్జవారిపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం 1,700 గ్రాముల గంజాయిని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేశారు. కోడూరు ఎక్సైజ్ సీఐ తులసి తెలిపిన వివరాల మేరకు.. మండలానికి చెందిన రాజేష్, హరి, సుమన్ గంజాయి తరలిస్తున్నారని సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. ఆటో, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో ఇద్దరు ముద్దాయిలు పరారీలో ఉన్నారని తెలిపారు. అరెస్టు చేసిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు తెలపారు.

జాతీయ స్థాయి చెస్ టోర్నమెంటులో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు



చెస్‌లో సత్తాచాటిన జిల్లా క్రీడాకారులు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బెంగుళూరు రూరల్ జిల్లా చెస్ సంఘం, కర్ణాటక రాష్ట్రం చెస్ సంఘం సహకారంతో ఈనెల 13వ తేదీన బెంగుళూరు వైట్‌ఫీల్డ్ ఏరియా మంజునాథ కళ్యాణ మండపంలో జరిగిన జాతీయ స్థాయి చెస్ టోర్నమెంటులో జిల్లా చెస్ క్రీడాకారులు సత్తా చాటినట్లు జిల్లా చెస్ సంఘం కార్యదర్శి అనీస్ దర్బారి తెలిపారు. ఇందులో అండర్-16 బాలికల విభాగంలో లాస్యశ్రీ మూడో స్థానం, అలాగే అండర్-9 బాలికల విభాగంలో అమీనా మూడో స్థానం, అండర్-9 బాలుర విభాగంలో అర్హన్ 5వ స్థానం, అండర్-16 బాలుర విభాగంలో అనురాగ్ 6వ స్థానం, అండర్-12 బాలికల విభాగంలో లక్ష్మిమనుశ్రీ 6వ స్థానం, అండర్-16 బాలికల విభాగంలో సరయూ 10వ స్థానం సాధించారు. వీరితో పాటు ఈ టోర్నమెంటులో బెస్ట్ ఉమెన్ ప్లేయరుగా తబుస్సం పురస్కారం అందుకున్నారని ఆయన తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లోని సభా భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9-30 గంటల నుండి 10 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్, 10గంటల నుండి పీజీఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో అర్జీలు సమర్పించిన బాధితులు తమ అర్జీ ఏ దశలో ఉందో తెలుసుకొనేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1100 నెంబరుకు కాల్ చేయాలని ఆయన సూచించారు.

దంపతులకు గాయాలు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు కావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గుర్రంకొండ మండలం రామాపురం గ్రామానికి చెందిన మణికుమార్, అతని భార్య యామిని ద్విచక్రవాహనంలో వాల్మీకీపురం మార్గంలో నిమ్మనపల్లి మీదుగా బోయకొండకు బయలుదేరారు. అయితే మార్గమధ్యంలో కొండయ్యగారిపల్లి క్రాస్ వద్దకు రాగానే ద్విచక్రవాహనాన్ని మదనపల్లి నుండి నిమ్మనపల్లి వస్తున్న ప్యాసెంజర్ ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వీరిని ఓ ప్రైవేటు వాహనంలో మదనపల్లి ఆసుపత్రికి తరలించారు. దీంతో ప్రమాదనికి కారణమైన దిగువపల్లికి చెందిన చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ఆటో డ్రైవర్ల దరఖాస్తులకు మూడు రోజులే గడువు



● కొత్తగా నమోదయ్యే వారికి చివరి తేదీ ఈ నెల 19
● ఏడాదికి రూ.15 వేల నగదు సాయం
● కుటుంబంలో ఒకరు మాత్రమే అర్హులు
● అక్టోబరు 1న ముఖ్యమంత్రిచే పంపిణీ ప్రారంభం
● మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం

కలికిరి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు రూ.15వేల సాయం అందించేందుకు ప్రభుత్వం శనివారం రాత్రి మార్గదర్శకాలు విడుదల చేసింది. గతంలో వైసీపీ ప్రభుత్వం వాహన మిత్ర పేరుతో ఈ పథకాన్ని అమలు చేసింది. కానీ అప్పట్లో స్వంతంగా ఆటో కలిగిన వాహనం నడుపుతున్న వారికి ఏడాదికి రూ.10వేలు వంతున మంజూరు చేశారు. అయితే తాజాగా కూటమి ప్రభుత్వం ఈ మొత్తాన్ని రూ.15 వేలకు పెంచి అందజేయనుంది. గతంలో వాహన మిత్ర పథకం కింద లబ్ధిదారులుగా వున్నవారు మూడు రోజుల్లోగా అంటే ఈనెల 17వ తేదీలోగా స్థానిక సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవలసి వుంది. ఈ జాబితా ఇప్పటికే ప్రభుత్వం వద్ద సిద్ధంగా వుండటంతో మరోసారి స్థానికంగా పరిశీలించి అర్హులైన వారికి మంజూరు చేయనున్నారు. గతంలో లబ్ధి పొందని కొత్త డ్రైవరు/వాహనదారులు ఈనెల 19వ తేదీలోగా దరఖాస్తు పంపుకోవలసి వుంటుంది. పాత/కొత్త దరఖాస్తులను స్వీకరించడం, సరిచూసి పరిశీలించే బాధ్యతను గ్రామ, వార్డు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌కు అప్పగించారు. తుది లబ్ధిదారుల జాబితాలను ఆయా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు పంపాల్సి వుంటుంది. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో 22వ తేదీకి పరిశీలన పూర్తి చేసిన అనంతరం కలెక్టర్లు 24వ తేదీ నాటికి రవాణా శాఖకు అప్పగించాల్సి వుంది. అనంతరం అక్టోబరు 1న సీఎం చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని ప్రారంభిస్తారు.

లబ్ధిదారుల అర్హతలు

ప్యాసింజర్ ఆటో, మోటారు క్యాబ్, మాక్సీ క్యాబ్ యజమానులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. మూడు చక్రాల/నాలుగ చక్రాలు, తేలికపాటి రవాణా వాహనాలకు ఈ పథకం వర్తించదు. అర్హత కలిగిన వాహనాలు ఏపీలో రిజిస్ట్రేషన్ కలిగి వుండాలి. అదే విధంగా డ్రైవర్ల లైసెన్సులు కూడా ఏపీలోనే జారీ అయి వుండాలి. వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ వుండాలి. ఆటోలకు మాత్రం దీని నుంచి తాత్కాలిక మినహాయింపు ఇచ్చారు. ప్రస్తుతానికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకున్నా ఈ ఏడాది మంజూరు చేస్తారు. అనంతరం నెల రోజుల్లోగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సమర్పించాలి. లేదంటే మరుసటి ఏడాది మంజూరు వుండదు. వాహనాల మీద ఎలాంటి పెండింగ్ చలాన్లు వుండకూడదు. లబ్ధిదారుడు ఆధార్, రేషన్ కార్డు కలిగి వుండాలి. ఒక కుటుంబంలో ఒక వాహనానికి లేదా ఒక డ్రైవరుకు మాత్రమే అర్హత వుంటుంది. ఒకే కుటుంబంలో ఒకరి పేరుతో వాహనం వుండి మరొకరి పేరుతో డ్రైవింగ్ లైసెన్స్ వున్నా చెల్లుబాటవుతుంది. వాహనం తప్పనిసరిగా డ్రైవరు అధీనంలో వుండాలి. అర్హత కలిగిన వారు, గతంలో లబ్ధి పొంది ఇప్పటికీ వాహనం కలిగిన వారు నేరుగా వారికి సంబంధించిన సచివాలయాల్లో దరఖాస్తులు అందజేయాలి. దరఖాస్తుదారుని కుటుంబంలో ఎవరూ ప్రభుత్వ ఉద్యోగులు లేదా రిటైర్మెంట్ పెన్షన్‌దార్లు వుండకూడదు. అయితే పారిశుధ్య కార్మికులకు మాత్రం ఇందులో మినహాయింపు వుంది. ఆదాయపన్ను చెల్లింపుదారులు కూడా కుటుంబంలో వుండకూడదు. నెలసరి విద్యుత్ వినియోగం 300 యూనిట్లు మించకూడదు (దీనికోసం 12 నెలల సరాసరి వినియోగాన్ని లెక్కిస్తారు) పట్టణాల్లో వేయి చ.అ. మించి స్థలం కూడా వుండకూడదు. ఇక 3ఎకరాల తడి లేదా 10 ఎకరాల మెట్ట భూములు మించి వుండకూడదు.

కార్పొరేషన్‌ల ద్వారా నిధుల విడుదల

అర్హులైన లబ్ధిదారులకు మంజూరయ్యే నిధులు కులాల వారీగా వారికి సంబంధించిన కార్పొషన్‌ల ద్వారా విడుదలవుతాయి. ఇందుకు గానూ రెడ్డి కార్పొరేషన్, బ్రాహ్మణ, ఎస్సీ కార్పొరేషన్, కమ్మ కార్పొరేషన్, ఎస్టీ కార్పొరేషన్, బీసీ-ఏ, బీ, సీ, ఇ గ్రూపులకు సంబంధించిన కార్పొరేషన్లు, మైనారిటీ కార్పొరేషన్, క్రిస్టియన్ కార్పొరేషన్, ఈబీసీ కార్పొరేషన్, ఆర్య వైశ్య కార్పొరేషన్, క్షత్రియ కార్పొరేషన్ల ద్వారా రూ.15వేల వంతున లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమవుతాయి.

ఏపీఐఐసీ డైరెక్టర్‌గా వర్ధినేని ప్రసాద్‌రెడ్డి



బద్వేలుటౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ డైరెక్టర్‌గా బద్వేలుకు చెందిన తెలుగుదేశం పార్టీ ప్రధాన నాయకుడు వర్ధినేని ప్రసాద్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన సేవలను గుర్తించిన ప్రభుత్వం డైరెక్టర్ పదవిని కల్పించడంతో అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. కష్టకాలంలో కూడా పార్టీని ముందుకు తీసుకువెళుతూ, నియోజకవర్గంలో క్రియాశీలకంగా పాల్గొంటూ, కార్యకర్తలకు అండగా ఉంటూ మంచి గుర్తింపు పొందారు ప్రసాద్‌రెడ్డి. ఈయన సేవలను ఎప్పటికప్పుడు అధిష్టానం దృష్టికి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్ కుమార్‌రెడ్డి తీసుకువెళ్లి వారికున్న అభిమానాన్ని చాటుకున్నారు. ప్రసాద్‌రెడ్డికి పదవి రావడం పట్ల గోపవరం జడ్పీటీసీ కలువాయి జయరామిరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ భైసాని ప్రతాప్‌రెడ్డి, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మిత్తికాయల రమణయాదవ్, బ్రాహ్మణపల్లె సొసైటీ చైర్మన్ పి.రామానాయుడు, టీడీపీ నాయకులు కొండయ్య, నిమ్మకాయల గోపాల్‌రెడ్డి, పసుపులేటి శ్రీనివాసులు, వెంకటసుబ్బారెడ్డి, భూమిరెడ్డి రామ సుబ్బారెడ్డి, క్రిష్టారెడ్డి, జగదీశ్వరరెడ్డి, వివేకానందరెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

అప్పు చేసి అదృశ్యమయ్యాడు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అప్పు తీసుకున్న వ్యక్తి ఎవరికీ చెప్పకుండా పది రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి అదృశ్యమయ్యాడు. దీంతో అప్పు ఇచ్చిన వారు లబోదిబోమంటూ గుండెలు బాదుకుంటున్నారు. ఇటీవల పోరుమామిళ్లలో ఇలాంటి సంఘటనలు సర్వసాధారణమయ్యాయి. అప్పులు చేయడం, కనిపించకపోవడం, తీరా బాధితులు ఫిర్యాదు చేస్తే ఐపీ పెట్టడం మామూలైంది. పోరుమామిళ్లలోని వరికుంట్ల బస్టాండు సమీపంలో బంగారు వ్యాపారం చేసే ఒక వ్యక్తి ప్రొద్దుటూరు బంగారు వ్యాపారులకు రూ.30లక్షలు పెట్టి బంగారు వడ్డాణం కొనుగోలు చేశాడని, అదే నమ్మకంతో మరో వడ్డాణాన్ని చూపించి వస్తానని నమ్మించి ఎన్నిరోజులకు రాకపోవడంతో ప్రొద్దుటూరు బంగారు వ్యాపారులు పోరుమామిళ్ల వచ్చి విచారించినట్లు సమాచారం. ఈ క్రమంలో సదరు వ్యక్తికి అప్పు ఇచ్చిన వారు కూడా ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. ఒక్కొక్కరి వద్ద రూ.5లక్షల నుండి రూ.30లక్షల వరకు బాకీలు చేసినట్లు సమాచారం. 15 ఏళ్ల క్రితం అతను చేసిన అప్పులకు అతని తల్లిదండ్రులు వడ్డీతో సహా చెల్లించి ఇంకెప్పుడు తమ కుమారుడికి ఎవ్వరూ కూడా అప్పులు ఇవ్వవద్దని, ఇస్తే తమకు సంబంధం లేదని తల్లిదండ్రులు వేరుపడినట్లు తెలిసింది. కానీ బాకీ ఇచ్చినవారు తల్లిదండ్రులను వత్తిడి చేస్తే డబ్బులు వస్తాయి కదా అని భావించి ఆదివారం ఆ ప్రయత్నాలు కూడా చేశారు. కొందరు పెద్ద మనుషులు జోక్యం చేసుకుని ఇది మంచి పద్ధతి కాదని అతని తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టరాదని చెప్పినట్లు సమాచారం. ఏదిఏమైనా రెండు మూడురోజుల తరువాత ఈ విషయంపై పూర్తిగా క్లారిటీ రానుంది. అంత వరకు ఊహాగానాలు ప్రచారాలు కొనసాగుతుంటాయి.

స్టేషన్‌కు చేరిన ఆశ్రమ పాఠశాల వ్యవహారం

బి.కొత్తకోట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆశ్రమ పాఠశాల వ్యవహారం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. సయోధ్యకు పెద్దలు జరిపిన ప్రయత్నాలు విఫలమవడంతో పాఠశాల యాజమాన్యం ఇరకాటంలో పడింది. బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ పరిధిలోని సంస్కృత ఆశ్రమ పాఠశాలలో ఇద్దరు విద్యార్థుల నడుమ జరిగిన ఘర్షణలో ఓ విద్యార్థి కంటికి తీవ్రగాయమవడం, గాయపడిన విద్యార్థి శేషాద్రి కుటుంబీకులు రూ.కోటి డిమాండ్ చేసినట్టు ప్రచారం జరగడం తెలిసిందే. విద్యార్థికి అవసరమైన చికిత్స చేయిస్తామని, సేవాదృక్పథంతో సంస్కృతి పరిరక్షణ కోసం నడుస్తున్న పాఠశాలను రచ్చకీడ్వవద్దని యాజమాన్యం పెద్దల ద్వారా బాధిత విద్యార్థి తండ్రి కడపకు చెందిన అమరనాథరెడ్డితో సయోధ్యకు తీవ్ర ప్రయత్నాలు జరిపింది. అయితే అందుకు అంగీకరించని విద్యార్థి తండ్రి ఆదివారం పోలీసులను ఆశ్రయించాడు. తమకు న్యాయం చేయాలని పాఠశాల యాజమాన్యంపై కేసునమోదు చేయాలని పేర్కొన్నట్టు సమాచారం. ఈ విషయమై ఏఎస్ఐ భాస్కర్‌నాయక్ మాట్లాడుతూ ఫిర్యాదు ఇచ్చినమాట వాస్తవేమనని, బాధితులతో పూర్తిగా చర్చించి కేసునమోదు చేస్తామన్నారు.

వైభవంగా అమ్మవారి త్రిశూల ప్రతిష్ఠ



త్రిశూలాన్ని ఊరేగింపు తీసుకువస్తున్న దృశ్యం

పులివెందుల రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో పోలేరమ్మ అమ్మవారి త్రిశూల ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. పులివెందులలో అంకాళమ్మ తల్లి, పెద్దమ్మ తల్లి, పోలేరమ్మ తల్లి అమ్మవార్లు ఒకే రీతిలో వెలిసి ఉన్నారు. ప్రాచీన చరిత్ర కలిగిన అమ్మవార్లకు పులివెందుల ప్రజలు ప్రతి ఏడాది ఉత్సవాలు, దేవర కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఇటీవల కాలంలో గుర్తుతెలియని వ్యక్తులు పోలేరమ్మ అమ్మవారి ముందు ఉన్న త్రిశూలాన్ని తొలగింపజేశారని కొందరు తెలిపారు. పునఃప్రతిష్ఠించాలని చూసినప్పటికీ పలు కారణాలతో ప్రతిష్ఠించలేదు. దీంతో హిందువులంతా పెద్దఎత్తున ఉత్సవం నిర్వహించి త్రిశూలాన్ని ప్రతిష్ఠించాలని కంకణం కట్టుకున్నారు. ఈ నేపథ్యంలో పోలేరమ్మ అమ్మవారికి త్రిశూలాన్ని ప్రత్యేకంగా తయారు చేయించారు. ఆదివారం ఉదయం 8గంటల ప్రాంతంలో అంకాళమ్మ తల్లి ఆలయం నుంచి త్రిశూలం, అమ్మవారి రూపానికి ఊరేగింపు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, నృత్యాల నడుమ మహిళలు, యువతులు బోనాలు సమర్పిస్తూ పోలేరమ్మ ఆలయానికి చేరుకున్నారు. అనంతరం జైపోలేరమ్మ తల్లి అంటూ నినాదాలు చేస్తూ త్రిశూలాన్ని ప్రతిష్ఠించారు. పెద్దఎత్తున భక్తులు జంతుబలులు సమర్పించారు. భారీఎత్తున అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పులివెందుల ఎస్ఐ విష్ణునారాయణ, ట్రైనీ ఎస్ఐ అనిల్‌కు మార్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి, తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి సతీమణి, మాజీ సర్పంచు ఉమాదేవి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్‌రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, బీజేపీ సీనియర్ నాయకుడు లక్షుమయ్య, తదితర టీడీపీ, బీజేపీ నాయకులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

లీకేజీలకు మరమ్మతులు జరిగేనా..?

- దుస్థితిలో కోనాయపల్లె చెరువు
- ఆయకట్టుదారుల ఆందోళన
- స్పందించని ఇరిగేషన్ శాఖ అధికారులు



కోనాయపల్లె చెరువు

పెండ్లిమర్రి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని కోనాయపల్లె గ్రామ సమీపంలో ఉన్న చెరువు క్రింద 88 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. వర్షాకాలంలో చెరువు నిండితే ఆయకట్టు రైతులు రెండు పంటలను పండించు కోవచ్చు అనే ఆశతో ఎదురుచూస్తూ ఉంటారు.అయితే ఒక పంటకే చెరువులో ఉండే నీరు వృథాగా లీకేజీ రూపంలో వంకలోకి పోతోంది.గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో చెరువు పూడికతీత పనులు కానీ,మరమ్మతులు కూడా చేయించిన పాపాన పోలేదు.చెరువుకు ఉన్న గేటును బిగించినా కూడా గేటు క్రింద నుంచి నీరు వృథాగా వంకలోకి పోతోంది.అలాగే చెరువు కట్ట వెంబడి ముళ్ల పొదలు అల్లుకొని ఉన్నాయి.చెరువులో పూడికతీత పనులు జరిగితే ఎక్కువ నీటిని నిలువ చేసుకోవచ్చు.ఈ లీకేజీని అరికట్టాలని ఆయకట్టుదారులు ఆందోళన చెందుతున్నారు. నీరు నిలువ ఉంటే రెండు పంటల ను సాగు చేసుకోవచ్చునని రైతులు ఆశ పడు తున్నారు.కూటమి ప్రభుత్వం సాగునీటి వనరులకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఇరిగేషన్ అధికారులు స్పందించక పోవడంతో భవిష్యత్తులో సాగు నీటి కి ఇబ్బందులు తప్పవని ఆయకట్టుదారులు ఆరోపిస్తున్నారు.ఈ ఏడాది వర్షాలు కురియడంతో చెరువుకు జలకళ ఉట్టిపడుతోంది.చెరువు నిండటంతో ఆయకట్టు రైతులకు పంటలు పండటమే కాకుండా పరిసర ప్రాంత బోరుబావుల్లో భూగర్భ జలాలకు ఎలాంటి లోటు ఉండదు.తూము మరమ్మతులు సరిగా చేయక పోగా,చెరువుకు ఆనుకొని రోడ్డు అరకొరగా నిర్మించడం వల్ల చెరువు నీరు వృథాగా వంకలో కలుస్తోంది.చెరువుకు ఇరిగేషన్ అధికారులు పూడికతీత,మరమ్మతులు చేస్తే ఎక్కువ నీటిని నిలువ ఉంచి సాగు విస్తీర్ణాన్ని పెంచవచ్చు. అధికారులు తక్షణం స్పందించి లీకేజీలు అరికట్టాలని ఆయకట్టుదారులు కోరుతున్నారు.



లీకేజీ అవుతున్న నీరు



లీకేజీతో వృథాగా పోతున్న నీరు

మరమ్మతులకు అంచనాలు వేసి పంపాం

చెరువు మరమ్మతులకు అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపాం. గేటు లీకేజీ మాట వాస్తవమేనని,రైతులు అధికారుల దృష్టికి తేవడం జరిగింది.ఉత్తర్వులు వచ్చిన వెంటనే మరమ్మతులు చేపడతామని తెలిపారు.

జగదీష్, డీఈ

కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 20శాతం నిధులు కేటాయించాలి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేంద్ర, ఆర్థిక బడ్జెట్‌లో విద్యారంగానికి 20శాతం కేటాయించాలని పీఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు మహమ్మద్ షఫిఉల్లా డిమాండ్ చేశారు. ఆదివారం కడపనగరం ఓ ప్రైవేట్ మీటింగ్ హాల్‌లో పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల అధ్యక్షతన రాష్ట్ర స్థాయి పొలిటికల్ ట్రైనింగ్ క్యాంప్ జరిగింది. ఈ ట్రైనింగ్ క్యాంప్‌ను ఉద్దేశించి మహమ్మద్ షఫిఉల్లా, ఆర్‌ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జానకిరాములు మాట్లాడుతూ కేంద్రం 20శాతం, రాష్ట్రం 30శాతం బడ్జెట్‌ను విద్యారంగానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్రకార్యదర్శి సుబ్బరాయుడు, నాయకులు పాల్గొన్నారు.

హిందీ భారతీయుల వారసత్వ సంపద

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): హిందీ భాష భారతీయుల వారసత్వ సంపద అని ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ జాయింట్ డైరెక్టర్ ఎస్.మహబూబ్ బాష పేర్కొన్నారు. ఆది వారం సీపీ బ్రౌన్ భాషపరిశోధన కేంద్రంలో ఆర్‌యూపీపీ ఆధ్వర్యంలో జాతీయ భాష హిందీ దినోత్సవం వేడుకలను జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాష అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ బి.నారాయణరెడ్డి, డాక్టర్ రమేష్‌యాదవ్, ఖాదర్‌బాష, పద్మనాభయ్య తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో సందడే.. సందడి

కడప కల్చరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సాయంత్రం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా నగర రిమ్స్ సమీప శిల్పారామంలోని సాంస్కృతిక కళావేదికపై కడప నగరానికి చెందిన విజిల్ డ్యాన్స్ అకాడమీ చిన్నారులు వివిధ సినిమా, జానపద గీతాలకు వేసిన స్టెప్పులకు ప్రేక్షకులు ఈలలు వేశారు. రామ్మాచిలకమ్మా..., రాను బొంబాయికి రానూ.., గొబ్బియాలో గొబ్బియాలో.. అనే పాటలకు చిన్నారులు స్టెప్స్ వేశారు. దీంతో ఒక్కసారిగా శిల్పారామం ఈలలుతో సందడిగా మారింది.

'డాక్టర్ అని పెట్టుకోవడానికి అర్హులమే'

కడప సెవెన్ రోడ్స్ సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఫిజియోథెరపిస్టులుగా సేవలు అందిస్తున్న తాము డాక్టర్ అనే పదం ప్రీఫిక్స్‌గా వినియోగించడానికి అర్హులమేనని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపీ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఫక్రుద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 2021లో నేషనల్ కమిషన్ ఫర్ ఎలైడ్ అండ్ హెల్త్ కేర్ కౌన్సిల్ యాక్ట్ తీసుకుచ్చిందని తెలిపారు. ఫిజియోథెరపిస్టులు డాక్టర్ అనే పదాన్ని ఉపయోగించకూడదని ఢిల్లీలోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్‌సర్వీసెస్ కార్యాలయం నుంచి ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌కు డాక్టర్ సునీత శర్మ ఇటీవల లేఖ రాశారని తర్వాత నిబంధనలను తెలుసు కొని ఆ లేఖను ఉపసంహరించుకున్నారని తెలిపారు.

'విద్య, వైద్యం దూరం చేస్తే సహించేది లేదు'



కడప మల్టీ స్పెషాలిటీ, మెంటల్ హాస్పిటల్స్‌ను పరిశీలిస్తున్న వైసీపీనాయకులు

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యం పేదలకు దూరం చేస్తే సహించేది లేదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష, మేయర్ సురేష్‌బాబు మండిపడ్డారు. కడపసూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సైతం అమ్ముకునేందుకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. ఆది వారం కడప సూపర్ స్పెషాలిటీ, క్యాన్సర్, మెంటల్ హాస్పిటల్స్‌ను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ పేదలు కోరుకునేది విద్య, వైద్యం, ఉపాధి మాత్రమేనని చెప్పారు. అటువంటి విద్య, వైద్యం పేదలకు దూరం చేయాలనిచూస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. వైసీపీ రాష్ట్ర, జిల్లా,నగర స్థాయి నాయకులు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దూదేకుల వర్గీయులు సంఘటిత శక్తిగా ఎదగాలి

కడప మారుతీనగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దూదేకుల వర్గీయులు సంఘటిత శక్తిగా ఎదగాలని దూదేకుల ఫైనాన్స్ ఫెడరేషన్ స్టేట్ డైరెక్టర్ వీరభద్రుడు పిలుపునిచ్చారు. ఇటీవల దూదేకుల ఫైనాన్స్ ఫెడరేషన్ స్టేట్ డైరెక్టర్‌గా వీరభద్రుడు నియమితులయిన నేపథ్యంలో రాష్ట్ర నూర్‌బాష్ దూదేకుల సంక్షేమ సంఘం జిల్లాకమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎర్రముక్కపల్లెలో గల నూర్‌బాష్ దూదేకుల భవన్‌లో వీరభద్రుడుకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గగ్గుటూరి చిన్నరాజ, రాష్ట్ర కార్యదర్శి కేపీ హుసేన్ పలువురు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్,సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఆర్టీయూపీ రాష్ట్ర అధ్యక్షుడు గులిశెట్టి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం కడపనగరం భుజంగరావు ఆర్టీయూపీ టీచర్స్ భవన్‌లో రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్తు రాష్ట్ర అధ్యక్షుడు గునిశట్టి శ్రీనివాసులు అధ్యక్షతన సంఘం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల నూతన వేతన సవరణ కమిటీ తక్షణమే ఏర్పాటుచేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ అరియర్స్, రిటైర్డ్ పింఛనర్ల బకాయిలు, ప్రావిడెంట్ ఫండ్,సరెండర్ లీవు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్తోజు వీరబ్రహ్మం, జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు, టీచర్స్ హోం ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ సబ్సిడీ రుణాలు వెంటనే మంజూరు చేయాలి

కడప మారుతీనగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీ సబ్సిడీ రుణాల నోటిఫికేషన్ విడుదలైతే చేసిందే కానీ మూడు నెలలుగా రుణాల తాలూకు సబ్సిడీ వేయలేదని జాతీయ చేతివృత్తుల ఐక్య వేదిక పార్టీ (జేసీఐపీ) జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కలెక్టరేట్ సమీపంలో ఉన్న జేసీఐపీ కార్యాలయంలో మాట్లాడారు. రుణాలకు సబ్సిడీ వేయడంలో నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం దారుణమన్నారు.

కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన పుత్తా



సీకేదిన్నె,సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్త వర్దిరెడ్డి విశ్వనాథరెడ్డి తల్లి అచ్చెమ్మ ఆదివారం మరణించడంతో ఆయన కుటుంబాన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పరామర్శించారు. వారి స్వగ్రామం చింతకొమ్మదిన్నె మండలం బాలుపల్లెకు వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

పోరుమామిళ్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరువెంగళాపురంలో హ్యూమన్‌రైట్స్ నిర్వహించిన ఉచితవైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు చేశారు.

కార్యకర్తలకు విలువ ఇవ్వని పార్టీ వైసీపీ

● టీడీపీలో చేరిన పలు కుటుంబాలు


ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ లో చేరిన వైసీపీ నేతలు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలను వినియోగించుకోవడం తప్ప వారికి విలువ ఇవ్వని పార్టీ వైసీపీ అని టీడీపీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి ఆధ్వర్యం లో సోములవారిపల్లె పంచాయ తీకి చెందిన వైసీపీ మైనారిటీ నేతలు సయ్యద్ గండికోట నూర్‌బాషా, సయ్యద్ జామాల్ బాషా, సయ్యద్ ఖాజా హుస్సేన్. సయ్యద్ రఫీ, జాఫర్ అల్లాబకాష్ నైరుల్లా, గౌస్‌లాజమ్, సయ్యద్ కరీ ముల్లా, సయ్యద్ సిద్దిక్, సయ్యద్‌రసూల్, సయ్యద్ అలి, సయ్యద్ అమీర్ లు టీడీపీ లో చేరారు. వారందరికి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అభివృద్ధిని చూసి వరదరాజులరెడ్డి నాయకత్వం పై విశ్వాసంతో పార్టీలో చేరినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నంద్యాల వరప్ర సాద్ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ జబివుల్లా, కౌన్సిలర్ వైఎస్ మహ్మద్ గౌస్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ బేపారి జాకీర్ , బేపారి గౌస్, నూరి , వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, టౌన్ బ్యాంక్ చైర్మన్ సుబ్బారెడ్డి, పెన్నానగర్ షామీర్ షరీఫ్, ఆటోబాషా, షరీఫ్, ఖాసీం, ఆటో సుధాకర్, కాళాయప్ప, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు, సెప్టెంబఋ 14 (ఆంధ్ర జ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా ఎమ్మెల్యేలు చొరవ చూపాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామ్‌సుందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కామనూరులో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని కలిసి ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ఎమ్మెల్యేలు చొరవ చూపి ప్రభుత్వంలో చలనం తేవాలని కోరారు. .కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి క్రిష్టారెడ్డి, కార్యదర్శి రమేష్‌రెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి మండల అధ్యక్షుడు సుబ్బారెడ్డి, రాజుపాళెం అధ్యక్షుడు నరసింహకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను మోసంచేయవద్దు

మైదుకూరు సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి):రాష్ట్రప్రభుత్వఉద్యోగ, ఉపాధ్యాయులను ఆర్థిక పరమైన అంశాల హామీ అమలు విషయంలో మోసం చేయవద్దని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘు నాథరెడ్డి డిమాండు చేశారు. మైదుకూరు పట్టణంలో ఎస్టీయూ కడప జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ భాషా అధ్యక్షతన నిర్వహించిన ద్వితీయ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్సీ అమలుఆలస్యం జరిగిందని, మధ్యంతర భృతిని మరచిందన్నారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు సురేష్ బాబు,రాజు, బాలగంగిరెడ్డి, రమణారెడ్డి, పాలకొండయ్య, రామోహన్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అలుగువంక ముంపులో వరి పొలాలు


మునకతో దెబ్బతిన్న వరి నాట్లు

దువ్వూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అలుగువంక వరదతో దువ్వూరు పరిధిలోని జడ్డి పొలాల్లో వరి పంటలు ముంపునకు గురయ్యాయి. ఇటీవల అడపా దడపా వర్షాలు పడుతుండడంతో అలుగు వంక నుంచి నీరు అధికంగా దిగువకు వెళుతున్నాయి. కాలువ మధ్యలో చెక్ డ్యాం నిర్మించినా నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో వంకనీరు పొలాల మీదకు వస్తోంది. దీంతో ముంపునకు గురై వరి నాట్లు పాడవుతున్నాయి. సాగు చేసిన రైతులు ఆందోళన పడుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులకింద వెచ్చించి నష్టపోవాల్సి వస్తోందన్నారు. ఈ ప్రాంతంలో చెక్‌డ్యాం నిర్మించినా ప్రయోజనం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

పాఠశాల, కాలేజీ కోసం స్థలం పరిశీలన


పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

కొండాపురం, సెప్టెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): గండికోట ప్రాజెక్టు కింద ముంపునకు గురైన కొండాపురం జడ్పీ హైస్కూల్, జూనియర్ కాలేజీని నూతనంగా ఏర్పాటు చేయడానికి కావలసిన స్థలాన్ని అధికారులు పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆదివారం మండల కూటమి ఇన్‌చార్జి శివనారాయణరెడ్డి పరిశీలించారు. ఇప్పటికే వాటి కోసం అధికారులు 3.75 ఎకరాలు స్థలం కేటాయించగా, మరింత స్థలం కోసం పాతకొండాపురం ఆర్‌అండ్‌ఆర్ సెంటర్ వద్ద పరిశీలించారు. సుమారు రూ.12 కోట్లతో కాలేజీ, స్కూల్ ఏర్పాటు కోసం అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో ఈఈ గురివిరెడ్డి, మండల కూటమి నాయకులు చామల విష్ణువర్దన్‌రెడ్డి, డీలర్ నాగేశ తదితరులు పాల్గొన్నారు.

హోల్‌సేల్ మెడికల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం


హోల్ సేల్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న దృశ్య

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు హోల్‌సేల్ మెడికల్ అసోసియేషన్ నూతన కార్యవర్గంను ఆదివారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా చంద్రశేఖర్, కార్యదర్శిగా టి.ద్వారకనాథ్, కోశాధికారిగా బి.కేశవులును ఎన్నుకున్నారు. చంద్రశేఖర్ నాలుగవ సారి ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ నుంచి జీఎస్టీ క్యాప్స్‌లో తగ్గిన పన్నులను వినియోగదారునికి అందించాలనిసూచించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ హోల్ సేల్ మెడికల్ అసోసియేషన్ సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు మెడికల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పశువులకు గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు

కాశినాయన సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి) కాశినాయన మండలంలో సోమవారం నుంచి జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద ఉచితంగా పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారులు రామారావు, అశోక్ కుమార్‌లుఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రెడ్డికొట్టాల, వరికుంట్ల, ఇటుకులపాడు గ్రామాల్లో క్యాంపులు 3 రోజులు ఉంటాయన్నారు. వచ్చేనెల 15 వరకు ఈకార్యక్రమం నిర్వహిస్తామనిపశువులు కలిగిన రైతులు టీకాలు వేయించాలని వారు కోరారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి క్రీడా ఎంపికలు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జి కారోనేషన్ క్లబ్‌లో జిల్లా అండర్-19 బాల బాలికల క్రీడా పోటీల ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఆదివారం ఉదయం రైఫిల్ షూటింగ్, పెన్సింగ్, టేబుల్ టెన్నిస్ ఎంపికలు నిర్వహించారు.

ఐక్యతతో కార్పెంటర్ల అభ్యున్నతి

ప్రొద్దుటూరు రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్పెంటర్ల అభ్యున్నతికి సమాజంలో తగిన స్థానం దక్కాలంటే ఐక్యతతో మెలగాల్సిన అవసరం ఉందని కార్పెంటర్ యూనియన్ నాయకులు షేక్ చాంద్‌బాషా, వీరాంజనేయచారిలు పేర్కొన్నారు. ఆదివారం ప్రొద్దుటూరు మండల కార్పెంటర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గృహ నిర్మాణాల్లో మధ్యవర్తుల ఆదిపత్యం పెరిగిందని, ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కూలీల మూలంగా తమకు డిమాండ్ లేక జీవనభారం పెరుగుతోందన్నారు. శ్రమకు తగిన పారితోషికం రావడంలేదన్నారు. కార్పెంటర్లు తమ సమస్యలను తెలియజేస్తూ కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాసాచారి, ఉదయ్‌కుమార్ ఆచారి, తప్పెట నరసింహ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఎర్రగుంట్ల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాలలో 1993-94 టెన్త్ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ కలయిక జరిగింది. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్దులు నేర్పి ఉన్నత శిఖరాలకు బాటలు వేసిన ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాము చదువుకున్న పాఠశాలకు ఇన్వెర్టర్, మరికొన్ని వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు మునిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సంగిరెడ్డి, మైసూరయ్య, మనోహర్‌రెడ్డి, నాఘభూషణ్‌రెడ్డి, పుల్లమ్మ, నాగభూషణ్‌రెడ్డి, శివప్రభాకర్‌రెడ్డి, నాగేంద్రబాబు, నారాయణదాసు, సరళదేవి, తదితరులు పాల్గొన్నారు.


పూర్వవిద్యార్థుల సమ్మేళనం

చాపాడులో: మండల కేంద్రమైన చాపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకుని సంతోషంగా గడుపుకున్నారు. 1998-99 బ్యాంచ్ విద్యార్థులు ఆరోజు వారికి పాఠాలు బోధించిన పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు జయరామిరెడ్డి, రామమునిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బాబ్జిలకు పాదాభివందనం చేశారు. తరగతి గదుల్లో ఆరోజు జరిగిన విషయాలను జ్ఞాపకాలను మాట్లాడుకుని సంతోషంగా గడిపారు.

పెన్నాకు కొనసాగుతున్న నీటివిడుదల

మైలవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటి విడుదల కొనసాగుతుందని మైలవరం జలాశయ అధికారులు ఆదివారం తెలిపారు. మైలవరం జలాశయం నుంచిపెన్నానదికి అయిదు వేల క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 60 క్యూసెక్కులు, దక్షిణ కాలువకు 140 క్యూసెక్కులు, నీటిని విడుదల చేస్తున్నారు. గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయానికి 5000 క్యూసెక్కులనీరు వచ్చి చేరుతోంది. పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు రాష్ట్రప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని ఎపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024లో ఎస్సీ వర్గీకరణను రద్దు చేయడంతో మాదిగ ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో డప్పు, చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం మాదిగ, ఏపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బాలలక్షుమయ్య మాదిగ, మైదుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటనారాయణ, బాలనరసింహులు, బాలయ్య, నాగరాజు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బద్వేలుటౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎన్జీఓ కాలనీ సమీపంలో ద్విచక్రవాహనంపై వెళుతున్న ఆవుల వెంకటసుబ్బయ్య డివైడర్‌ను ఢీ కొనడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యుల సలహామేరకు మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు.

గంగమ్మకు బోనాలు సమర్పణ

జమ్మలమడుగు, సెప్టెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలో ఆదివారం గంగమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద నుంచి మహిళా భక్తులు మరికొందరు మెరువణిగా కూరగాయల మార్కెట్ గంగమ్మ దేవాలయం వద్దకు చేరుకుని అక్కడ జంతుబలులు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. వారు మాట్లాడుతూ వర్షాలు బాగా కురవాలని, గతంలో మొక్కుకున్నామని ఆదిశగా రెండు రోజుల క్రితం భారీ వర్షం కురవడంతో ఇంకా వర్షం కురిసి పంటలు బాగా పండాలని పూజలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, పొన్నపురెడ్డి కామేశ్వరరెడ్డి, ద్వారకచర్ల శ్రీనివాసులరెడ్డి, సంజీవరెడ్డి, ఈశ్వరరెడ్డి, పాల్గొన్నారు.

సంఘంలో బలిజలకు ప్రత్యేక స్థానం

మైదుకూరు రూరల్,సెప్టెంబరు 14(ఆంధ్ర జ్యోతి): సంఘంలో బలిజలకు ప్రత్యేక స్థానం ఉందని టీడీపీ రాష్ట్ర రైతు సంఘం నాయకుడు ధనపాల జగన్ అన్నారు. హైదరాబాద్‌లోని జలవిహార్‌లో జరిగిన ఇంటర్నేషనల్ మహా బలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఐకాన్ 10 కార్యక్రమంలో జగన్ మాటాడారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు మాజీ సీఎస్ కేస్ కుమార్, తెలంగాణ హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డులతో బాధ్యత పెరిగింది

పోరుమామిళ్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులతో గురువుల బాధ్యత మరింత పెరిగిందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ అన్నారు. ఆదివారం పోరుమామిళ్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ పోరుమామిళ్ల ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో ఈశ్వర్‌రావు అధ్యక్షతన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను ఘనంగా సన్మానించారు.

నేడు యూరియా పంపిణీ

దువ్వూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలానికి మంజూరైన యూరియా సోమవారం పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. దువ్వూరు-2 సచివాలయానికి 12 టన్నులు, చింతకుంట-2 కు 10 టన్నులు, ప్రైవేటు డీలర్లకు 12 టన్నులు మంజూరైనట్లు చెప్పారు. యూరియా కోసం వచ్చే రైతులు ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం తీసుకురావాలన్నారు.

బాలికల జట్టుకు ఇందు ఎంపిక

కొండాపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లావనూరుకు చెందిన సి.ఇందు అనే బాలిక రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ బాలికల జట్టుకు ఎంపికైంది. అనంతపురం జిల్లా రామాపురంలో జరిగిన పోటీలలో ఇందు పాల్గొన్నారు.

మహారాజశ్రీ బద్వేలు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.P. No. 90/2025 O.S. No. 6/2025

సోమేసుల శ్రీనివాసులు తండ్రి రామయ్య, వయస్సు 42 సం., వ్యవసాయం, కోటవీధి, పోరుమామిళ్ళ (గ్రా. & మం.) వైఎస్ఆర్ కడపజిల్లా - పిటిషనర్/వాది

V/s

1) పంది గురివిరెడ్డి తండ్రి నడిపి గురివిరెడ్డి, వయస్సు 33 సం., వ్యవసాయం, రెడ్డినగర్, రంగసముద్రం పంచాయితి పోరుమామిళ్ళ టౌన్, వైఎస్ఆర్ కడపజిల్లా.
2) పంది మంజునాథ్‌రెడ్డి తండ్రి నడిపి గురివిరెడ్డి వయస్సు 45 సం. రెడ్డినగర్, రంగసముద్రం పంచాయితి పోరుమామిళ్ళ టౌన్, వైఎస్ఆర్ కడపజిల్లా - రెస్పాండెంట్స్ / ప్రతివాదులు

పై నెంబరు కేసులో పిటిషనరు, వాది, రెస్పాండెంట్స్ మరియు ప్రతివాదులు అయిన మీపైన దావా దాఖలు చేసినారు. 1వ ప్రతివాది, 1వ రెస్పాండెంట్ అయిన మీపైన రు. 27,28,704/-లు వసూలు నిమిత్తం దావా మరియు R39, R1 పిటిషన్‌కూడా ఇరువురిపైన దాఖలు చేసి యున్నారు. సదరు మొత్తం చెల్లించనంతట Mandatory ఇంజక్షన్ ద్వారా షెడ్యూల్ దాఖలా ఆస్తిని స్వాధీనపర్చవలసినదిగా కోరుచూ పిటిషన్ మరియు దావా దాఖలు చేసియున్నారు. సదరు కేసులో రెండవ ప్రతివాది, రెస్పాండెంట్‌గా కూడా పార్టిగా చేర్చినందున మీరు వురు రాజశ్రీ కోర్టు వారి ఎదుట 6-10-2025వ తేది ఉదయం 10.30 గంటలకు రాజశ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షముగా దావాను మరియు పిటిషన్‌ను తీర్మానించబడును.

షెడ్యూల్ : House bearing D.No. 11/287 situated at YSR Kadapa (Dist) Proddatur Regd. Dist, Badvel Sub-Dist, Porumamilla Mandal, Rangasamudram Panchayat limits at 2nd Line of Reddy Nagar and Bounded on the : East : House of Chinna Gurivi Reddy, South : Joint Wall of Chinna Ramaiah, West : House of Pandi Gurivi Reddy (1st Defendant) North : Rastha

పి.వి.ఎన్.ప్రసాద్, అడ్వకేట్, బద్వేలు.

మహారాజశ్రీ బద్వేలు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి (F.T.C.) రాజంపేట at బద్వేలు వారి కోర్టులో

A.S. No. 1/2022

1) జెర్రిపోతు బాలసుబ్బయ్య తండ్రి పోలయ్య, వ్యవసాయం, ఎస్టీ కాలనీ, రంగసముద్రం పంచాయితి, పోరుమామిళ్ల టౌన్ & మం., YSR కడపజిల్లా.
2) జెర్రిపోతు భూలక్షుమ్మ భర్త బాలసుబ్బయ్య, ఎస్టీ కాలనీ, రంగసముద్రం పంచాయితి, పోరుమామిళ్ల టౌన్&మం.,YSR కడపజిల్లా. - అప్పిలెంట్స్/వాదులు

V/s

1) పెనుబడి జయచంద్ర తండ్రి రామయ్య, వ్యవసాయం, ఎస్టీ కాలనీ, రంగసముద్రం పంచాయితి, పోరుమామిళ్ల టౌన్ & మం., వైఎస్ఆర్ కడపజిల్లా,
2) పెనుబడి రాములమ్మ తండ్రి రామయ్య, అవివాహిత, వ్యవసాయం, ఎస్టీ కాలనీ, రంగసముద్రం పంచాయితి, పోరుమామిళ్ల టౌన్ & మం., YSR కడపజిల్లా,
3) కోనేటి రమణ తండ్రి అంకయ్య, వ్యవసాయం, ఎస్టీ కాలనీ, రంగసముద్రం పంచాయితి, పోరుమామిళ్ల టౌన్&మం., YSR కడపజిల్లా.
- రెస్పాండెంట్స్/ప్రతివాదులు

1 నుంచి 3వ ప్రతివాదులపైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారు 15-12-2021వ తేదీన O.S. No.94/2020 దావాను సవాల్ చేస్తూ రాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి రాజంపేట F.T.C. బద్వేలు కోర్టులో A.S. No. 1/2022 నెంబరుగల అప్పీలు దాఖలు చేసి యున్నారు. అందులో 1వ రెస్పాండెంట్ వివాహం చేసుకొనక చనిపోయినందున అతని వారసులు ఎవరైన వుండిన 25-9-2025వ తేది ఉదయం ఉదయం 10.30 గంటలకు రాజశ్రీ కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల అప్పీలును మరియు దావాను పరోక్షంగా తీర్మానించబడును.

షెడ్యూల్ : Suit House open Place situated in Kadapa Dist. Badvel Sub-Dist, Porumamilla Town & Mandal, Rangasamudram Village fields, bearing Sy. No. 1002 A.C. 0.04 Cents dry. **Boundaries :** East - Rastha, South : House of K. Vijayamma, West : Foundation of P.V.subbaiah & Yeddula Venkata Subbaiah S/o Ramesh, North : Site of Katta Thirupalu

పి.వి.ఎన్.ప్రసాద్,
అడ్వకేట్, బద్వేలు.